సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



రాజన్నకు జనజాతర

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. – 8లో..



వేములవాడలో ట్రాఫిక్ జామ్

వేములవాడఅర్బన్: వేములవాడ మూలవాగు నుంచి హరితహోటల్ వరకు ఆదివారం భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం పడే అవకాశం లేదు. చలిగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జాతీయ అవార్డులు ప్రదానం



పురస్కారం అందుకుంటున్న వేణుగోపాలాచారి



అవార్డులు అందుకున్న అనిల్, రమేశ్

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్, పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేశ్, తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన శ్రీరామోజు వేణుగోపాలాచారి ఆదివారం జాతీయ అవార్డులు అందుకున్నారు. విజయవాడ తెలుగు సాంస్కృతిక బాలోత్సవ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు–వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డులు అందజేశారు. గత 20 ఏళ్లుగా చిత్రకళారంగంతోపాటు కార్వింగ్ కళాకారునిగా రాణిస్తున్న అనిల్‌ను జాతీయ కళారత్న పురస్కారానికి ఎంపిక చేశారు. దుంపెన రమేశ్ పుష్కర కాలంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీతో ముందుకెళ్తుండడంతో ఆయన సేవలను సంస్థ గుర్తించింది. బస్వాపూర్‌కు చెందిన వేణుగోపాలాచారి జ్యోతిష్యశాస్త్రంలో చూపిన ప్రతిభను గుర్తించి విశిష్ట జ్యోతిష్యరత్న జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. అవార్డు ప్రదానోత్సవంలో ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య, డాక్టర్ వలబోజు మోహన్‌రావు, డాక్టర్ రంగిశెట్టి రమేశ్‌రావు, డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, డాక్టర్ వెంపటి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో అంతర్జాతీయ తెలుగుసభలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాసరవేణి పరుశురాం

సిరిసిల్లటౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో జనవరి 5, 6, 7 తేదీల్లో రెండో అంతర్జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలుగు మహాసభల ప్రచార కార్యదర్శి వాసరవేణి పరుశురాం తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. 25 ప్రక్రియలపై సదస్సులు ఉంటాయని తెలిపారు. సిరిసిల్ల సాహితీవేత్తలు జనపాల శంకరయ్య, ముదారి సాయిమహేశ్, గుండెల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలి



సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలంటున్న గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని మూడోవార్డులో ఏర్పాటు చేయదలచిన సెల్‌టవర్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం సెల్‌టవర్ నిర్మాణానికి ఏర్పాట్లు చేయగా.. కాలనీవాసులు నిరసన తెలిపారు. టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో తమకు ప్రమాదం పొంచి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాన్ని ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వైన్‌షాపు, దాబాను తొలగించాలి

- చందుర్తి ఎస్సీకాలనీవాసుల తీర్మానం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైన్‌షాపుతోపాటు అనుమతి లేని దాబా హోటళ్లను తొలగించాలని ఆ కాలనీకి చెందిన 62 మంది ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. వైన్‌షాపు, అనుమతి దాబాతో అర్ధరాత్రి వరకు మందుబాబులు చేస్తున్న వీరంగంతో ప్రాంతవాసులకు నిద్ర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఇళ్లకు ప్రహరీలు లేవని, మరుగుదొడ్లు లేని ఇళ్లు సైతం ఉన్నాయని.. దీంతో అభద్రతతో కాలం వెల్లదీస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీకాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైన్‌షాపు, అనుమతిలేని దాబా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారితోపాటు కలెక్టర్, ఎస్పీలకి సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యాసంగికి నీరందేనా?

- కూలిపోతున్న తూములు..తుప్పుపట్టిన షట్టర్లు
- కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- రూ.60కోట్ల ప్రతిపాదనలు బుట్టదాఖలు

పాడయిన తూములు.. చెత్తాచెదారం నిండిన కాలువలు.. ముళ్లచెట్లు మొలిచి నీరు కదలలేని స్థితికి చేరాయి. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులో నిండుగా నీళ్లు ఉన్నా పొలాలకు చేరని దుస్థితి ఉంది. కాల్వలు అధ్వానంగా మారగా.. తూములు పాడయి చుక్కనీరు కదిలే పరిస్థితి లేదు. ఎగువమానేరు ప్రాజెక్టు కాల్వలు, తూములపై గ్రౌండ్ రిపోర్టు..



ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి ఇదీ..



నర్మాల శివారులో శిథిలావస్థకు చేరిన తూము

అధ్వానంగా తూములు

కుడి, ఎడమ ప్రధాన కాలువల తూములు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. పూర్వం రాళ్లతో నిర్మించిన తూములు కూలిపోయాయి. అత్యధిక తూములకు షట్టర్లు లేవు. కొన్ని చోట్ల తుప్పుపట్టి పోయాయి. తూములకు అడ్డంగా ఇసుక సంచులను పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌లోని తూములు, షట్టర్ల పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో ప్రధాన కాలువలకు లైనింగ్ చేశారు. ప్రస్తుతం చాలా చోట్ల లైనింగ్ దెబ్బతింది. కాలువలు కోతకు గురవుతున్నాయి. దీంతో సాగు నీటి వృథా అవుతుంది.

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులో పూర్తిస్థాయి 30 ఫీట్లలో నీరు ఉంది. మరో ఇరువై రోజుల్లో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయనున్నారు. ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో చెట్ల పొదలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారనున్నాయి. చివరి ఆయకట్టు వరకు నీరందుతుందో.. లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కాలువలను శుభ్రం చేశారు. కానీ మళ్లీ యథావిధిగా మారాయి. ప్రస్తుతం ఇరిగేషన్ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తామని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం మొదలుపెట్టలేదు. ప్రధాన కాలువలతోపాటు ఉపకాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది.

ప్రాజెక్టు పరిధిలో..

నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పరిధిలో ఎడమ, కుడి ప్రధాన కాలువలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందనుంది. ఎడమ కాలువ ద్వారా నర్మాల, గంభీరావుపేట గ్రామాలకు, కుడి ప్రధాన కాలువ ద్వారా గంభీరావుపేట మండలం కోళ్లమద్ది, కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి, నామాపూర్, గూడూరు, గూడెం, ఆవునూర్, పోతుగల్, ముస్తాబాద్, తెర్లుమద్ది గ్రామాల వరకు సాగునీరు వెళ్లాల్సి ఉంది.

రూ.60కోట్ల ప్రతిపాదనలు బుట్టదాఖలు

ఎగువమానేరు ప్రాజెక్టు పరిధిలోని కాలువల లైనింగ్, తూముల ఏర్పాటు, మరమ్మతులు, కొత్తషట్టర్ల ఏర్పాటు వంటి దాదాపు 400 రకాల పనులు చేపట్టడానికి ఇరిగేషన్ అధికారులు రెండేళ్ల క్రితం ప్రభుత్వానికి రూ.60కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ప్రతిపాదనలు కాస్త బుట్టదాఖలయ్యాయి.

తూములు, షట్టర్లు ఏర్పాటు చేస్తేనే ప్రయోజనం



ప్రధాన, ఉప కాలువలకు కొత్తగా తూములు, షట్టర్లు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. పాతవి పూర్తిగా దెబ్బతిన్నాయి. నీరు ముందుకు వెళ్లకుండా సాగునీరు వృథా అవుతుంది. ప్రతీసారి అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.
– రాజబోయిన ఆంజనేయులు, నర్మాల

నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి



సాగునీటి కాలువలపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, చెట్లపొదల తొలగింపునకు చర్యలు చేపట్టడం లేదు. ఏడాది క్రితం ఏదో తూతూమాత్రంగా పనులు చేశారు. ఇప్పుడు కాలువల్లో నీరు ముందుకు పారే పరిస్థితి మాత్రం లేదు. కాలువలను శుభ్రం చేసే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. అదేవిధంగా కాలువల లైనింగ్ పనులు చేపట్టాలి. – ఎడబోయిన అనిల్, నర్మాల

కాలువలు శుభ్రం చేస్తాం



ఎగువమానేరు ప్రాజెక్టు పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పెరిగిన పనికిరాని చెట్లను మా సిబ్బంది చేత తొలగిస్తాం. గతేడాది కాలువలను శుభ్రం చేయడం జరిగింది. ఇప్పుడు ఎక్కడైతే మళ్లీ పూడిక, చెత్తాచెదారం ఉందో వాటిని తొలగించే పనులు చేస్తాం. కాలువలు, తూములు, షట్టర్ల ఏర్పాటు పనుల కోసం గతంలో రూ.60కోట్ల ప్రతిపాదనలు ఇచ్చాం. మళ్లీ ప్రతిపాదనలు తయారు చేస్తాం.
– అమరేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ

‘లక్ష్య’ంతో ముందుకు..

- టెన్త్ విద్యార్థులపై ఫోకస్
- ఉత్తీర్ణత పెంపే లక్ష్యం
- కొనసాగుతున్న స్టడీ అవర్స్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదోతరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతశాతం పెంపే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకెళ్తోంది. విద్యార్థులకు అభ్యసనపై అవగాహన కల్పించడంతోపాటు ఉపాధ్యాయుల బోధనకు మాడ్యుల్స్ అందించారు. వీటితోపాటు నిత్యం స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేసేలా టీచర్లకు ఆదేశాలు జారీ చేసింది.

రోజూ స్టడీ అవర్

నిత్యం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల విధులు, ప్రచారాల హోరుతో ప్రత్యేక తరగతులకు కాస్త అంతరాయం ఏర్పడినప్పటికీ ఇటీవల సీరియస్‌గా నిర్వహిస్తున్నారు.

అందుబాటులోకి అభ్యసన దీపికలు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూపొందించిన పదోతరగతి విద్యార్థులకు అభ్యసన దీపికలు అందించారు. గణితం, సైన్స్, సోషల్, బయోలజీ సబ్జెక్టులకు సంబంధించిన అభ్యసన దీపికలు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అభ్యసన దీపికల ఆధారంగా అభ్యసన చేయిస్తున్నట్లు చెప్పారు.

వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలోని ప్రభుత్వ హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఉపాధ్యాయులు లేరన్న విమర్శలు ఉన్నాయి. సరైన సంఖ్యలో ఉపాధ్యాయులు లేనప్పుడు ప్రత్యేక తరగతులు ఎలా నిర్వహించేదని ప్రశ్నిస్తున్నారు. సబ్జెక్టుల ఉపాధ్యాయులు లేరని విద్యాశాఖకు వివరించినా పట్టించుకోవడం లేదని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.



అభ్యసనలో పదోతరగతి విద్యార్థులు

గతంలో సాధించిన ఫలితాలు

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2022–23	94.37
2021–22	95.6

ఉత్తమ ఫలితాల కోసం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో ప్రతిభ చూపేలా ఉన్నతి, లక్ష్య పేరిట కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు, పదోతరగతి విద్యార్థులకు లక్ష్య కార్యక్రమం జరుగుతుంది. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించేలా అభ్యసన కరదీపికలు అందించాం.
– శైలజ, ఎస్‌వో,సమగ్ర శిక్ష, సిరిసిల్ల

ప్రభుత్వాన్ని చూస్తుంటే.. బీఆర్‌ఎస్‌కు వణుకు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుత పాలన మొదలుపెట్టడంతో బీఆర్ఎస్ నాయకులకు వణుకు పుట్టిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సిరిసిల్లలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాలు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. మిగతా గ్యారంటీలు త్వరలోనే అమలవుతాయని తెలిపారు. రైతు రుణమాఫీ ఇస్తూనే వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, నాగుల సత్యనారాయణ, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, వెల్ముల స్వరూప, కల్లూరి చందన, గోనె ఎల్లప్ప, మ్యాన ప్రసాద్, సామల దేవదాసు, గంభీరావుపేట ప్రశాంత్, కోడం శ్రీనివాస్, గోలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లోగోలు ఆవిష్కరణ



మహాలక్ష్మి పథకం బస్సు ప్రారంభోత్సవం


సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు పెంపు లోగోలను ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆవిష్కరించారు. స్థానిక జిల్లా ఆసుపత్రి, అంబేడ్కర్ చౌరస్తాలో సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, ఆకుల కృష్ణ, డాక్టర్లు చీకోటి సంతోష్, సాయికుమార్, నయీమ, డిపో మేనేజర్ మనోహర్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సిరిసిల్లటౌన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి నేడు రద్దు చేస్తున్నటు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

టెంపుల్‌సిటీగా మారుస్తా

- స్థానికంగా ఉండి.. సమస్యలు పరిష్కరిస్తా
- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రం.. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడను టెంపుల్‌సిటీగా అభివృద్ధి చేస్తా.. రాష్ట్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తానని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్ నియోజవర్గం అభివృద్ధి.. ఈ ఐదేళ్లలో తన ప్రాధాన్యతాంశాలపై ఆదివారం ‘సాక్షి’ ఇంటర్వ్యూలో తెలిపారు. వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని.. స్థానికంగా ఉంటూ.. ప్రజల సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

- **సాక్షి:** రాజన్న గుడి అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏంటి?
- **ఆది శ్రీనివాస్ :** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నేను రెండు పర్యాయాలు రాజన్న ఆలయ చైర్మన్‌గా పనిచేశాను. భక్తుల సమస్యలపై నాకు అవగాహన ఉంది. ఇక్కడ నా ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప.. తెలంగాణ వచ్చాక ఒక్క పైసా పని జరుగలేదు. బడ్జెట్‌లో ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాజన్న గుడి కొచ్చి చూస్తే భక్తుల కష్టాలు కనిపిస్తాయి. రాజన్న గుడి అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొస్తాను. వేములవాడను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తాను. భక్తులకు వసతితోపాటు స్థానికులకు ఉపాధిమార్గాలు కల్పిస్తాను.
- **సాక్షి:** వేములవాడ పట్టణాభివృద్ధికి ఎలా ముందుకెళ్తారు ?
- **ఆది శ్రీనివాస్:** బ్రోచర్లు, నక్షలలో తప్ప వేములవాడ పట్టణం అభివృద్ధి కాలేదు. రాజన్న దర్శనానికి వస్తున్న భక్తులు ఇక్కడి పరిస్థితులను చూసి విస్తుపోతున్నారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లడం, చుట్టపుచూపుగా రావడం తప్ప చేసేందేమీ లేదు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన నేను వేములవాడకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చేలా కృషి చేస్తా.
- **సాక్షి:** నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. దీనిపై మీరేమి చేస్తారు ?
- **ఆది శ్రీనివాస్ :** మిషన్ భగీరథ నీటిని ప్రజలెవరూ తాగడం లేదు. కనీసం స్నానాలు కూడా చేయడం లేదు. కొన్ని గ్రామాలకు సరఫరానే లేదు. మిషన్‌భగీరథను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. గతంలోనే నల్లా నీరు సక్రమంగా సరఫరా అయ్యేది. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన అవసరం ఉంది.
- **సాక్షి :** వేములవాడలో డ్రెయినేజీలు సరిగ్గా లేవు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించే ఆలోచన ఉందా?
- **ఆది శ్రీనివాస్ :** వేములవాడలో డ్రెయినేజీ సిస్టమ్ సరిగా లేదు. మురికినీరు గుడి చెరువుతోపాటు మూలవాగులోకి వెళ్తోంది. దీన్ని సరిచేసి, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ ఏర్పాటు చేయిస్తాను. మూలవాగును సుందరంగా తీర్చిదిద్దుతా. గుడిచెరువు మురికిచెరువుగా మారింది. చెరువును బాగు చేస్తాను.
- **సాక్షి :** ట్రాఫిక్ సమస్యను ఎలా అధిగమిస్తారు?
- **ఆది శ్రీనివాస్:** వేములవాడలో రోడ్ల విస్తరణ అంశంపై గత ప్రభుత్వం అధికారులతో సర్వేలు చేపట్టింది. వాటిని సమీక్షించిన తర్వాత చర్యలు తీసుకుంటాం. భక్తులకు, స్థానికులకు సౌకర్యాలు పెంచుతాం. ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం.
- **సాక్షి:** రెండో వంతెన పరిస్థితి ఏంటి ?
- **ఆది శ్రీనివాస్:** మూలవాగులో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఆరు నెలల్లో పూర్తి చేయిస్తాను. అధికారులు, మంత్రులతో చర్చించి తప్పకుండా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పూర్తి చేయిస్తాను.
- **సాక్షి :** వ్యవసాయాభివృద్ధిపై మీ ప్రణాళిక?
- **ఆది శ్రీనివాస్ :** నేను రుద్రంగిలో పుట్టాను. రైతుల కష్టాలు తెలుసు. మెట్ట ప్రాంతం వేములవాడకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలు ఫాజుల్‌నగర్ రిజర్వాయర్‌కు చేరుతున్నాయి. అయితే మర్రిపల్లి రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, కలికోట సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణం, కుడి, ఎడమ ఉప కాలువులపై గతపాలకు నిర్లక్ష్యం చేశారు. ఆయా పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తాను.
- **సాక్షి:** నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారు?
- **ఆది శ్రీనివాస్:** నియోజకవర్గ ప్రజల సమస్యలు నాకు తెలుసు. అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తాను. రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మార్చుతాను.
- **సాక్షి:** విద్య, వైద్యం, రోడ్లు, రవాణాపై మీ ప్లాన్ ఏంటి?
- **ఆది శ్రీనివాస్ :** విద్య విషయంలో ఈ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. నేటికీ మహిళా జూనియర్ కళాశాల లేదు. మహిళా డిగ్రీ కళాశాల లేదు. మేడిపల్లి, భీమారం మండలాల్లో జూనియర్ కళాశాలలు లేవు. వాటిని ఏర్పాటు చేయిస్తాను. రుద్రంగికి వైద్యశాల తీసుకొస్తాను. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తాను.
- **సాక్షి:** గ్రామాలకు సరైన రోడ్లు లేవు? ఏం చేస్తారు?
- **ఆది శ్రీనివాస్:** గతంలో రోడ్లు బాగు చేయాలని పాదయాత్ర చేశాను. ప్రతీ గ్రామానికి డబుల్ రోడ్డు వచ్చేలా కృషి చేస్తాను. పొలాలకు వెళ్లేందుకు అవసరమైనచోట రోడ్లు వేయిస్తాను. మూడు మండలాల కనెక్టివిటీ ఉండే మోత్కురావుపేట రోడ్డు పూర్తికి చర్యలు తీసుకుంటాను. కోనరావుపేట మండలంలోని మూలవాగుపై ఆరు బ్రిడ్జీలు నిర్మిస్తాను.
- **సాక్షి:** ముంపు గ్రామాలు, యువతకు ఎలాంటి ఉపాధి చూపిస్తారు?
- **ఆది శ్రీనివాస్ :** సర్వం త్యాగం చేసి మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాను. మాజీ సీఎం కేసీఆర్ నిర్వాసిత ఒక్కో కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షలు ఇస్తామని మోసం చేశారు. ఈ అంశంపై చాలాసార్లు పోరాడిన. ముంపు గ్రామాల ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరిస్తాను. యువతకు ఉపాధి కోసం పరిశ్రమలు తీసుకొస్తాను.
- **సాక్షి:** మహిళల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?
- **ఆది శ్రీనివాస్ :** మహిళల అభివృద్ధికి కుటీర పరిశ్రమలను తీసుకొస్తాను. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తాను. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారంలోపే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పించాం. మహిళాజ్యోతి, ఇతర పథకాలతో మహిళారంగాన్ని మరింత ప్రోత్సహిస్తాం.

పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి

- ఉచిత బస్సు సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ప్రభుత్వ ఆస్పత్రికి పేదలే వస్తారని, వారికి నాణ్యమైన వైద్యం అందించాలని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో ఆరు పథకాలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. మొదటగా ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించిన విషయాన్ని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు నిరుపేదలకు లబ్ధి చేకూరుస్తాయన్నారు. మహిళలు ఉచిత బస్సులో ప్రయాణించి పుణ్యక్షేత్రాలు సందర్శించుకోవచ్చన్నారు. అత్యవసర సమయంలో డబ్బులు లేకున్నా ఎక్కడికైనా వెళ్లి రావచ్చన్నారు. అనంతరం మున్సిపాలిటీలో పరిధిలోని బుడిగజంగాలకాలనీకి వెళ్లి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఏటా వర్షాకాలం ఇళ్లలోకి వరద నీరు వస్తుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్‌లు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, ఏరియా ఆస్పత్రి వైద్యుడు మహేశ్‌రావు, ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, కనికరపు రాకేశ్, తూమ్ మధు, పాత సత్యలక్ష్మి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపోత్సవం



వేములవాడ: రాజన్న అనుబంధ కేదారీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం సహస్ర దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణ మహిళలు, వైవేములవాడ ట్రస్ట్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

బేగంపేటలో వడ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రామగిరి(మంథని):పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట ప్రధాన రహదారిపై హనుమాన్ ఆలయం మూలమలుపు వద్ద శనివారం రాత్రి వడ్ల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంటిపై బోల్తా పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ కోనుగోలు కేంద్రం నుంచి వడ్ల బస్తాల లోడ్‌తో వస్తుండగా డ్రైవర్ అజాగ్రతతో ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరార్ అయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో కెక్కర్ల కుమార్‌కు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయాడు.

ఆర్టీసీ బస్సులో బ్యాగ్ చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఆదివారం ఓ మహిళ నుంచి గుర్తు తెలియని దొంగలు బ్యాగ్ దొంగిలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన ఆముద గంగు తన మేనకోడలుతో కలిసి జగిత్యాలకు పనినిమిత్తం వచ్చింది. ఇంటికెళ్లేందుకు కొత్త బస్టాండులో ఆర్టీసీ బస్సులో సీటు ఆపేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఆమె మేనకోడలు బస్సు ఎక్కడంతో గుర్తు తెలియని వ్యక్తులు 'మీ మేనకోడలు బ్యాగు ఇవ్వమంటోంది.. ఇవ్వు ఆమెకిస్తా..' అని నమ్మించారు. నమ్మిన ఆమె చేతిలోని బ్యాగ్ ఇవ్వడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాగులో రూ.పదివేలు, సెల్‌ఫోన్ ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు కరెంటుపోల్‌ను బైక్‌తో ఢీకొని ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపిన వివరాలు. పొత్తూరుకు చెందిన కుర్మ అశోక్ కొడుకు మహేశ్(20) శనివారం రాత్రి బైక్‌పై పొత్తూరు నుంచి ఇల్లంతకుంట వైపు వెళ్తుండగా కందికట్కూర్ శివారులో కరెంటుపోల్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాక్షి' స్పెల్ బీ-మ్యాథ్ బీ పోటీలు

- సాధన స్కూల్లో సెకండ్ లెవల్ నిర్వహణ
- పరీక్షలకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు



సాధన పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిర్వహించిన సాక్షి స్పెల్ బీ-మ్యాథ్ బీ-2023 జిల్లా సెకండ్ లెవల్ పరీక్షకు స్పందన వచ్చింది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరై, ఇంగ్లిష్‌లో మెళకువలు, గణితంలో కొత్త ఫార్ములాలను నేర్చుకున్నారు. కేటగిరీ-1లో భాగంగా 1, 2వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-2లో 3, 4వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-3లో 5, 6, 7వ తరగతులు విద్యార్థులకు, కేటగిరీ-4లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు మూడో లెవల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని సాక్షి బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సాధన స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సాక్షి అడ్వర్టయిజ్‌మెంట్ ఆఫీసర్ వేముల శ్రీనివాస్, టీచర్ ధనలక్ష్మి, ప్రకాశ్, లింగమూర్తి, తిరుపతి తదితరులున్నారు.

అందరికీ ఉపయోగం



స్పెల్ బీ-మ్యాథ్ బీ లాంటి పరీక్షలు ప్రతీ సంవత్సరం పెట్టాలి. ఇవి అందరికీ ఉపయోగపడేవి. నేను ఇంగ్లిష్‌లో కొన్ని కొత్త పదాలు నేర్చుకున్నాను.

– ఎం.ఆదివ, సాధన స్కూల్

పరీక్ష బాగా రాశాను



సెకండ్ లెవల్ పరీక్ష బాగా రాశాను. ఇంగ్లిష్‌లో కొత్త పదాలను తప్పులు లేకుండా రాసే అవకాశం దొరికింది. మా ఫ్రెండ్స్ కూడా బాగా రాశారు.

– అదితి రెడ్డి, రావూస్ ఈ-టెక్నో స్కూల్

రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తా



స్పెల్ బీ పరీక్షతో ఇంగ్లిష్‌పై అవగాహన పెరిగింది. రాష్ట్రస్థాయికి పోటీలకు అర్హత సాధిస్తా. వేరే సబ్జెక్టుల్లో కూడా ఇలాంటి పరీక్ష పెట్టాలి.

–సాయిప్రియ, సాధన స్కూల్

థాంక్స్ టు సాక్షి



నేను ఫస్ట్ టైం సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. చాలా కొత్త పదాలు నేర్చుకున్నాను. తర్వాత రౌండ్‌కు సెలక్ట్ అవుతా. థాంక్స్ టు సాక్షి.

– షిఫా, రావూస్ ఈ-టెక్నో స్కూల్

మొదటిసారి రాశాను



నేను మొదటిసారి సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. ఇంగ్లిష్ పదాలు పలకడం, రాయడం ఎలాగో తెలుసుకున్నాను. హ్యాపీగా ఉంది.

– ఎస్.అక్షయ్, సాధన స్కూల్

కొత్త కాన్సెప్ట్



విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం సాక్షి మీడియా ఇలాంటి పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉంది. పుస్తకాలతో పోలిస్తే ఇది కొత్త కాన్సెప్ట్.

–మనోగన, రావూస్ ఈ-టెక్నో స్కూల్

నెట్టింట కోరుట్ల జంట

- ఆకట్టుకుంటున్న ఇన్‌స్టా వీడియోలు
- టిక్‌టాక్ నుంచి ఇన్‌స్టాగ్రామ్ దాకా..
- ఆరు నెలల్లో 1.60లక్షల మంది ఫాలోవర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కోరుట్ల:

భర్త : ఇగో.. నా పర్సులో ఐదువేలు కనిపించడం లేదు.. నువ్వేగిట్ల తీశావా..?
భార్య : ఏంటి..? వినిపిస్తలే..
భర్త : పర్సులో ఐదువేలులేవు నువ్వు తీసినవా
భార్య వినిపిస్తలేదు.. ఈడకూసుంటే వినిపిస్తలేదు
భార్య : అర్ధరాత్రి 3 గంటలకు ఎవ్వలతో మాట్లాడినవ్..
భర్త : వినిపిస్తలే.. ఈడగుసుంటే నిజంగానే వినిపిస్తలే..
భార్య : గుర్రుగా చూస్తుంటే భర్త పరుగు..

ఇలా ఒకటి రెండు కాదు.. పదుల సంఖ్యలో వీడియోలు ఇపుడు ఇన్‌స్టాగామ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆరు నెలల వ్యవధిలో లక్షకు మించి సబ్‌స్క్రైబర్స్‌ను దాటిపోయి నెట్టింట హల్‌చల్ చేస్తున్న ఈ ఇన్‌స్టా జంట జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన వారే. వారే బింగి రాకేశ్, మేఘన జంట.

దుబాయ్‌లో టిక్‌టాక్ నుంచి..

కోరుట్లకు చెందిన బింగి రాకేశ్ పదేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ఐటీ కంపెనీలో టెక్నీషియన్‌గానే పనిచేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని తపన పడేవాడు. ముందుగా టిక్‌టాక్‌లో సోలో వీడియోలు చేశాడు. ఈ వీడియోలకు స్పందన రావడంతో మరిన్ని వీడియోలు చేస్తూ నెటిజన్లను ఆకట్టుకున్నాడు. తర్వాత ఇండియాలో టిక్‌టాక్ బ్యాన్ కావడంతో రాకేశ్ వీడియోలు చేయడంలో కొంత వెనకబడ్డాడు. రెండేళ్ల క్రితం దుబాయ్ నుంచి కోరుట్లకు వచ్చిన రాకేశ్.. ఉపాధి కోసం ఫిష్ అడ్డా అనే హోటల్ పెట్టాడు. అనంతరం ఇన్‌స్టాగాంపై దృష్టి సారించాడు.

జీవిత భాగస్వామి సహకారంతో..

మొదట సోలో వీడియోలు చేసి లక్షలాది మందిని ఆకట్టుకున్న బింగి రాకేశ్ కోరుట్లకు వచ్చిన తరువాత తన భార్య మేఘన సహకారం తీసుకున్నాడు. మొదట ఇన్‌స్టా వీడియోలు చేయడానికి ఇబ్బందిపడినా.. తర్వాత ఒకరికొకరు పోటీపడి ఇన్‌స్టా వీడియోల్లో నటిస్తూ ఆకట్టుకుంటున్నారు. భర్తతో కలిసి ఇన్‌స్టాలో చేస్తున్న వీరిద్దరు చేస్తున్న వీడియోలు గంభీరంగా మొదలై కడుపుబ్బ నవ్వించే తీరుగా ముగియడంతో చాలామంది నెటిజన్లు ఎంతగానో ఇష్టపడి చూస్తున్నారు. ఆరునెలల వ్యవధిలో వీరిద్దరూ కలిసి చేసిన వీడియోలను ఇన్‌స్టాగాంలో 1.64 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండటం విశేషం.



సినిమాల్లో నటించాలని ఉంది

– బింగి రాకేశ్, మేఘన

నా మాటలో ఉన్న గాంభీర్యం.. నా భార్య మోములో వెంటవెంటనే మారిపోయే హావాభావాలు మాకు కలిసొస్తున్నాయి. మేమిద్దరం చేసిన ప్రతి కపుల్ వీడియో నెట్టింట ఫేమస్ అయ్యాయి. కొన్ని యూట్యూబ్ చానళ్లు, ఇతరత్రా చానళ్ల ఆఫర్లు ఇస్తున్నప్పటికీ సొంతంగా ఎదిగి సినిమాల్లో లేదా ఫోక్ సాంగ్స్‌లో నటించాలని ఉంది. మాకు ఆర్థికంగా ఎవరైనా మద్దతిస్తే మరిన్ని మంచి వీడియోలతో కోరుట్లకు మంచి పేరు తెస్తాం.

ఇన్‌స్టాగామ్ ఐడీ: రాకేశ్_బింగి6

ఉపాధికి ఊతం..

రాకేశ్, మేఘన జంట చేస్తున్న ఇన్‌స్టా వీడియోలతో ఉపాధికి అవకాశం దొరుకుతోంది. వీరి వీడియోలకు ప్రేక్షకులతోపాటు సబ్‌స్క్రైబర్స్ పెరుగుతుండటంతో సారీ కలెక్షన్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, బేబీ స్టూడియోలు, ఇతరత్రా కంపెనీలు ప్రమోషన్స్ కోసం యాడ్స్ అందిస్తున్నాయి. ఈ యాడ్స్‌తో ప్రతినెలా రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఓ వైపు పాపులారిటీ, మరోవైపు ఆదాయం రావడంతో ఈ జంట మరింత ఉత్సాహంతో వీడియోలు సిద్ధం చేస్తున్నారు. ఈ వీడియోల్లో మ్యూజిక్ మిక్సింగ్, ఎడిటింగ్ వంటి పనులను బింగి రాకేశ్ స్వయంగా చేస్తుండటం గమనార్హం. రానున్న కాలంలో జనం మెచ్చే రీతిలో మరిన్ని కపుల్ వీడియోలు తీయడానికి సన్నాహాలు చేస్తున్నామంటున్నారు రాకేశ్-మేఘన జంట.

ట్రాలీఆటో ఢీకొని ఒకరి మృతి

- అపస్మారక స్థితిలో మరొకరు
- దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కొదురుపాక వద్ద ఘటన



పూర్ణచందర్ (ఫైల్)



గాయపడిన సాయి కిరణ్

బోయినపల్లి(చొప్పదండి): దైవదర్శనాకి వెళ్లి వస్తుండగా.. ట్రాలీ ఆటో ఢీకొని ఒకరు మృతి చెందడంతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బోయినపల్లి మండలం కొదురుపాక పరిసరాల్లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన సిరిమల్ల పూర్ణచందర్(39), నూతి సాయికిరణ్(27) వేములవాడ రాజన్న దర్శనానికి బైక్‌పై వచ్చారు. దర్శనం అనంతరం బైక్‌పై వేములవాడ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా కొదురుపాక కేడీసీసీబీ పరిసరాల్లో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో పూర్ణచందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ సాయికిరణ్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయికిరణ్ కోమాలోకి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బైక్‌పై వస్తున్న కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన జక్కని రాజుకు సైతం స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతిచెందిన పూర్ణచందర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పూర్ణచందర్‌కు తండ్రి శేఖర్, భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజశేఖర్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లికి చంద్రగిరి రాజశేఖర్(28) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5న మద్యం కోసం డబ్బులు కావాలని ఇంట్లో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

లైంగిక దాడి నిందితుడి రిమాండ్

రాయికల్:పట్టణానికి చెందిన మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సింగు నగేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. బాలిక ఒంటరిగా ఉండగా గమనించిన నగేశ్ ఈనెల 8న లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నగేశ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి విచారణ చేపట్టి నగేశ్‌ను రిమాండ్‌కు తరలించారని ఎస్సై వివరించారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- నిందితుడిని చితకబాదిన స్థానికులు



నిందితుడికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం : జగిత్యాలలోని వాణినగర్‌కు చెందిన మతిస్థిమితం లేని రాజు (12)ను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తిని ఆదివారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వాణినగర్ ప్రాంతానికి చెందిన కొక్కుల గోపి, శైలజా దంపతుల కుమారుడు రాజు ఇంటిబయట ఆడుకుంటుండగా అలీ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి కొత్త బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. రాజు స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే అలీ రాజుతో బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తున్నాడు. స్థానికులు, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని అలీని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రాజును సురక్షితంగా ఇంటికి తీసుకవచ్చారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ



పోలీస్‌స్టేషన్‌లో రోదిస్తున్న వృద్ధురాలు

జగిత్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని శివవీధిలో సిగరెట్ కోసం వచ్చిన గుర్తు తెలియని అగంతకులు ఓ వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేశారు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. శివవీధికి చెందిన బోనగిరి ఇందిరా కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి సిగరెట్ కొన్నారు. ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానికులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'మహాలక్ష్మి, చేయూత'ను సద్వినియోగం చేసుకోండి

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని:ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కోరారు. స్థానిక బస్‌స్టాండ్‌లో ఆదివారం ఆయన మహాలక్ష్మి పథకం ప్రారంభించారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక మాతాశిశు ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు, ట్రాన్స్ జెండర్లు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో చేయూత ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయాన్ని రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీ కొండా శంకర్, కౌన్సిలర్లు రమాదేవి, హనుమంతరావు, ఆరోగ్య మిత్ర సంగీత పాల్గొన్నారు.

ధర్మారంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు ధ్వంసం

- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

ధర్మారం(ధర్మపురి):పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం తెల్లవారు జామున కొందరు యువకులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సత్యనారాయణ.. తన సిబ్బందితో కలిసి యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి ధర్మారం మండల కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొందరు బీఆర్‌ఎస్‌కు చెందిన యువకులు మద్యంమత్తులో ఆదివారం తెల్లవారుజామున ఫ్లెక్సీలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లిన సదరు యువకులు.. ఫ్లెక్సీలను చూసి ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాకపోవటంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు వివరించారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడి మృతి



వెంకటయ్య మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ యాచకుడు మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. విటారి వెంకటయ్య(87) అనే యాచకుడు జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి గ్రామంలో కొన్నేళ్లు ఓ ఇంట్లో అద్దెకు ఉన్నాడు. తర్వాత ఖాళీ చేసి, జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఉంటున్నాడు. అక్కడే బసవయ్య వేషధారణలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వెంకటయ్య శనివారం చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల వివరాలు తెలియకపోవడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి, దహన సంస్కారాలు పూర్తి చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజన్నకు జనజాతర

- కోడెమొక్కులు చెల్లించిన భక్తులు
- దర్శనానికి ఐదు గంటల సమయం



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి అంకానికి చేరుతుండడంతో చలిని సైతం లెక్కచేయకుండా భారీగా భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టడంతో క్యూలైన్‌లో నిల్చునేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. వసతిగదులు ఉన్న ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక దుర్గంధం వస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్క రోజే భక్తుల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరింది.